నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | RANGAREDDY

లక్ష్యానికి దూరంగా..

టార్గెట్ 80,000 మెట్రిక్ టన్నులైతే.. కొన్నది 7,000 మెట్రిక్ టన్నులే..

- రంగారెడ్డి జిల్లాలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు
- కేంద్రాల నిర్వాహకుల అనేక కొర్రీలు, ఆంక్షలు
- చేసేదేమీ లేక వ్యాపారులు, మధ్యదళారులను ఆశ్రయించిన రైతులు

బోసిపోయిన కొనుగోలు కేంద్రాలు



రంగారెడ్డి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. అధికారులు ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు బోసిపోయాయి. కేంద్రాల్లోని నిర్వాహకులు అనేక ఆంక్షలు, కొర్రీలు విధించడంతో చాలా మంది రైతులు వ్యాపారులు, మధ్యదళారులను ఆశ్రయించారు. తక్కువ ధరకు తమ పంటను అమ్ముకున్నారు. దీంతో జిల్లాలో అనుకున్న టార్గెట్‌కు అధికారులు చాలా దూరంలో ఉన్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 7,000 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. కాగా జిల్లాలో 1,38,000 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు.

కొనుగోళ్లలో దళారులదే పైచేయి..

జిల్లాలో 8,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే అందులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 7,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మిగిలిన ధాన్యం వ్యాపారులు, మధ్యదళారుల చేతుల్లోకి వెళ్లింది. కొనుగోలు కేంద్రాల్లో అక్కడి నిర్వాహకులు విధించే ఆంక్షలు, కొర్రీలను తట్టులేక.. తక్కువ ధరకే తమ పంటను దళారులకు అన్న దాతలు విక్రయించి నష్టాల పాలయ్యారు.

ప్రభుత్వం సన్నా రకానికి బోనస్‌గా రూ.500 ఇస్తామని ప్రకటించినా చాలామంది రైతులకు బోనస్ రా లేదు. మరోవైపు అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలం లేక కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తేమ శాతం అధికంగా ఉన్నదని.. అక్కడి నిర్వాహకులు కొనకుండానే తిరిగి ఇండ్లకే పంపించారు. అలాగే, ఎక్కువ మంది కౌలురైతులే ఉండడంతో వారికి పాస్‌బుక్కులు లేక ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లలేక మధ్యదళారులకే విక్రయించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా రైతులకు వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూర లేదు. జిల్లాలో ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, మహేశ్వరం, ఆమనగల్లు లాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైనా రైతులు ఆ కేంద్రాల కంటే దళారుల వద్దకే అధికంగా వెళ్లారు.

రైతుకు బేడీలు వేయడం అత్యంత క్రూరత్వం..

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 12 : లగచర్ల ఘటనలో అరెస్టై సంగారెడ్డి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు గుండెపోటు రాగా అతడిని జైలు నుంచి దవాఖానకు తరలించే సమయంలో పోలీసులు చేతులకు బేడీలు(సంకెళ్లు) వేయడం అత్యంత క్రూరత్వమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. హీర్యానాయక్‌కు ఇంతకు ముందే గుండెపోటు వచ్చిందని.. అతడికి ప్రభుత్వం సరైన చికిత్స అందించకపోవడంతో మళ్లీ గుండెపోటు వచ్చిందన్నారు. రైతును రాజు చేస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు బేడీలు వేసి హీనంగా చూస్తున్నదని మండిపడ్డారు. రైతుకు సంకెళ్లు వేసిన ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

పరామర్శ నేరమా..?

అస్వస్థతకు గురైన విద్యార్థినులను కలిసేందుకు వెళ్తుంటే అడ్డుకుంటారా..?

- ప్రజల ఓట్లతో గెలిచిన మాకు ప్రొటోకాల్ వర్తించదా..?
- కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే తమ్ముడికి వర్తిస్తుందా..?
- సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ మండిపాటు
- తాండూరుకు వెళ్తున్న మాజీ మంత్రులను వికారాబాద్‌లో అడ్డుకున్న పోలీసులు..అరెస్టు
- రోడ్డుపైనే బైఠాయించి నిరసన

అస్వస్థతకు గురైన విద్యార్థినులను కలిసి వస్తామని కలెక్టర్‌కు ఫోన్ చేసి అనుమతించాలని కోరుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రపద పటేల్ తదితరులు

వికారాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తాండూరులోని ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రులు పి. సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. తాండూరు వెళ్లకుండా సుమారు గంటపాటు రోడ్డుపైనే అడ్డుకోవడంతో.. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకుని పోలీసుల తీరుకు నిరసనగా నినాదాలు చేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి వస్తామని కలెక్టర్, ఎస్పీతో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఫోన్ చేసి మాట్లాడినా వారు అనుమతివ్వకపోవడంతో మాజీ మంత్రులతోపాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలరెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రప్రద్‌పటేల్, బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపైనే బైఠాయించి ధర్నా చేపట్టారు. విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తామంటే ప్రొటోకాల్ వర్తించదని కలెక్టర్ చెబుతున్నారని.. ప్రొటోకాల్ అంటే తాను ఎమ్మెల్యే, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రులం ఇంకేం ప్రొటోకాల్ కావాలని సబితారెడ్డి ప్రశ్నించారు. నిన్నగాక మొన్న ఎమ్మెల్యే తమ్ముడు వెళ్లి స్టూడెంట్స్‌ను చూసి వస్తారు. వారికి ప్రొటోకాల్ ఉంటుంది, మాకు ఎందుకు ఉండదు?.. తాండూరులో పుట్టిన వారికే ప్రొటోకాల్ వర్తిస్తుందంటే తానూ తాండూరులోనే పుట్టానని.. అధికార పార్టీకి చెందిన కార్పొరేషన్ చైర్మన్ చూసి రావొచ్చు కానీ, మేము వెళ్లొద్దంటే.. ఇదెక్కడి న్యాయమని సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుమారైలను చూసేందుకు తల్లిదండ్రులనూ అనుమతించకపోవడం తగదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వారికి ఒక నిబంధన, అధికార పక్షంలో ఉన్న వారికి మరో నిబంధన ఉంటుందా..? అని మాజీ మంత్రులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు సబితారెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీశైల్‌రెడ్డిలను చన్గోముల్ ఠాణాకు.. మెతుకు ఆనంద్‌ను నవాబుపేట పీఎస్‌కు, శుభ్రప్రద్ పటేల్‌ను పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా తాండూరులో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. మరోవైపు ఫుడ్ పాయిజన్ ఘటనపై న్యాయమూర్తి శివలీల నేరుగా హాస్టల్‌కెళ్లి ఆరా తీశారు. అదేవిధంగా ఫుడ్ పాయిజన్ ఘటనలో హాస్టల్ వార్డెన్ విశ్వకుమారి తోపాటు ముగ్గురు సిబ్బందిని కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చన్గోముల్ ఠాణాకు మాజీ మంత్రులు..

పూడూరు : మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లను పోలీసులు చన్గోముల్ ఠాణాకు తరలించారు. అక్కడ ఉన్న విలేకరులు ఫొటోలు తీసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మాజీ మంత్రి సబితారెడ్డి జోక్యం చేసుకొని విలేకరులనూ అరెస్ట్ చేసేలా పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు, ఇతరులను బయటికి పంపించి ఠాణా మెయిన్ గేట్‌ను మూసేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ మల్లేశం, అదిల్, జావిద్ తదితరులు ఠాణా వద్దకు చేరుకొని మాజీ మంత్రులను కలిసేందుకు వెళ్తామన్నా పోలీసులు అనుమతించలేదు. రెండు గంటలపాటు స్టేషన్‌లో ఉంచి వారిని తిరిగి హైదరాబాద్‌కు పంపించారు.

తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తున్నది

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రప్రద్ పటేల్

పరిగి : తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రప్రద్ పటేల్ ఆరోపించారు. తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రులు, బీఆర్ఎస్ శ్రేణులు, శుభ్రప్రద్ పటేల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పరిగి ఠాణాకు తరలించిన శుభ్రప్రద్ పటేల్‌ను పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్ కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శుభ్రప్రద్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ.. అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డగించి, అరెస్టు చేయ డం సరైంది కాదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను కాంగ్రెస్ సర్కారు తుంగలో తొక్కిందని.. హాస్టల్ విద్యార్థులకు మూడు పూటలా మంచి భోజనం పెట్టలేని దుస్థితిలో రేవంత్ సర్కార్ ఉన్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో 48 మంది విద్యార్థులు చనిపోయినా ఇంకా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నదన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, ఎక్కడా ఒక్క సంక్షేమ పథకమూ అమలు జరగడం లేదని విమర్శించారు. లగచర్లలో ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వబోమని చెప్పిన రైతులను జైలులో పెడితే ఒక రైతుకు గుండెపోటు వచ్చిందని అన్నారు. ప్రశ్నించే వారందరినీ పోలీసులతో అణచివేసే ధోరణి ని రేవంత్‌రెడ్డి సర్కారు అవలంబిస్తున్నదన్నారు. పోలీసులు చట్టానికి, రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలన్నారు.

పరిగి ఠాణా వద్ద బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రప్రద్‌పటేల్‌కు సంఘీభావం తెలిపిన మున్సిపల్ చైర్మన్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు

'హెచ్-సిటీ' వేగవంతానికి చర్యలు తీసుకోవాలి

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హెచ్-సిటీ ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్ఐయూఎంలో హెచ్-సిటీలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ. 3,500 కోట్లతో చేపట్టనున్న 38 రోడ్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు, రూ.150 కోట్లతో చేపట్టనున్న జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులను వేగంగా ప్రారంభించి, పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. హెచ్-సిటీ ఫేజ్-1లో భాగంగా రూ. 1,230 కోట్లతో చేపట్టే కేబీఆర్ పార్క్ చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ఈ ప్రాజెక్ట్ కింద చేపట్టాల్సిన భూసేకరణ, పరిహారంపై నివేదిక అందజేయాలన్నారు. 125 ట్రాఫిక్ జంక్షన్లలో అడ్డుగా ఉన్న 4,100 విద్యుత్ స్తంభాలను మూడు నెలల్లోగా తరలించి జంక్షన్లను అభివృద్ధి చేయడంతోపాటు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, టీజీఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్‌అలీ, వాటర్‌బోర్డ్ ఎండీ అశోక్‌రెడ్డి, ఖైరతాబాద్ జడ్పీ అనురాగ్ జయంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, వాటర్ బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్, పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ దేవానంద్, జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, హెచ్-సిటీ ప్రాజెక్ట్ పనుల అమలుపై ఎన్యూఎంఐలో సమావేశం అనంతరం విరించి జంక్షన్, పెన్షన్ ఆఫీస్ లింక్ రోడ్డును క్షేత్రస్థాయిలో బల్దియా కమిషనర్ ఇలంబర్తి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్‌తో కలిసి దానకిశోర్ పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు విరించి రోడ్డు వద్ద విస్తరణ పనులతోపాటు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. పెన్షన్ ఆఫీస్ వద్ద బల్కాపూర్ నాలాపై సిమెంట్ బ్రిడ్జి నిర్మించి రోడ్డు నం.12ను అనుసంధానం చేస్తామన్నారు. అక్కడ లింక్‌రోడ్డు నిర్మాణంపై అధికారులతో దానకిశోర్ చర్చించారు.

అరెస్టులకు భయపడం..

బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్ : అరెస్టులకు భయపడేది లేదని.. ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు. తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రులు, బీఆర్ఎస్ శ్రేణులు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యేను నవాబుపేట ఠాణాకు తరలించగా.. అక్కడ ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రాణాలు పోతుంటే ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇండ్ల నిర్బంధం, అరెస్టులపై ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదన్నారు. ఇందిర మ్మ రాజ్యమంటే విద్యార్థులకు కల్తీ ఆహారం, అడిగితే అక్రమ అరెస్టులేనా..? అని నిలదీశారు. ఆరు గ్యారెంటీల సంగతి దేవుడెరుగు కనీసం విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించడం ఈ సర్కారుకు చేతకావడం లేదన్నారు. సర్కారు నిర్లక్ష్యం, దాష్టీకానికి పిల్లలు బలవుతున్నారన్నారు.

పుర నిధులు.. సొంత పనులకు..

జనావాసాలకు దూరంగా అభివృద్ధి పరుగు

- పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి.. తన కుటుంబసభ్యులు, బంధువుల పట్టా భూములకు రహదారి కోసం ఏకంగా రూ.20 లక్షల మున్సిపాలిటీ నిధులకు కౌన్సిల్‌లో తీర్మానం చేశాడు. ఏడాది గడిచాక ఆ పనులు మొదలుపెట్టారు. అదీనూ చెరువు ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యారు.
- పెద్దఅంబర్‌పేటలోని జాతీయ రహదారిపై ఉన్న ఓ కన్వెన్షన్‌ను ఆనుకుని రూ.30 లక్షల మున్సిపల్ నిధులతో కన్వెన్షన్ మురుగు వెళ్లేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, దుమ్ము రాకుండా సీసీ రోడ్డు వేసుకున్నారు మరో ప్రజాప్రతినిధి. వార్డుకు కేటాయించిన నిధులను పక్క వార్డులో ఉన్న బంధువుల కన్వెన్షన్ వద్ద రోడ్డుకు మళ్లించారు. రూ.10 లక్షలకే టెండర్ అయినప్పటికీ మొత్తం రూ.30 లక్షల నిధులతో పనులు పూర్తిచేశారు.

- ప్రజల మేలు మరిచి బంధువులు, అనుయాయులకు పెద్దపీట
- ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్న పలువురు ప్రజాప్రతినిధులు
- అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నా.. చర్యలు నిల్
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పలువురు ప్రజాప్రతినిధులు ప్రజల మేలు మరిచి సొంత పనులు, బంధువర్గానికి పెద్దపీట వేస్తున్నారు. ప్రజలు కట్టిన పన్నుల రూపంలోని నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఇవన్నీ మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నా.. పట్టించుకోని దుస్థితి. ఉన్నతాధికారులు స్పందించకపోతే రూ.కోట్ల ప్రజాధనం ప్రజాప్రతినిధుల సొంత పనులకు ఉపయోగపడే పరిస్థితులున్నాయి. వాటిపై తగిన విచారణ జరిపి మున్సిపల్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దుర్వినియోగం అయితే నిధులను తిరిగి రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-రంగారెడ్డి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)/పెద్దఅంబర్‌పేట

సమస్యలు వదిలి.. సొంత పనులకు కదిలి

మున్సిపాలిటీల్లో కౌన్సిల్ తీర్మానాల ద్వారానే అభివృద్ధి పనులను చేపడుతారు. తమకు వచ్చిన నిధులను వార్డు పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలి. ఉమ్మడి సమస్య ఉంటే దాని పరిష్కారానికి అన్ని వార్డుల ప్రజాప్రతినిధులు కలిసి.. ఆయా వార్డులకొచ్చే నిధులను మళ్లించి పరిష్కరించొచ్చు. కానీ, వార్డుకు కేటాయించిన నిధులతో కొందరు ప్రజాప్రతినిధులు.. తమ అనుయాయులు, బంధువులు లేదా సొంతవారికి అవసరమైన చోట ప్రగతి పనులు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సొంత ఫామ్‌హౌస్‌లు, నిర్మించబోయే కన్వెన్షన్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాల వద్ద వసతుల కల్పనకు మున్సిపల్ నిధులను వినియోగిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఆయా వార్డుల్లో కాలనీలు పెరిగి మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా.. అవేమీ పట్టించుకోకుండా అయిన వారికే వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ఓ ప్రజాప్రతినిధి తన వార్డుకు కేటాయించిన రూ.30 లక్షలను పక్క వార్డుకు మళ్లించాడు. పెద్దఅంబర్‌పేట పరిధిలో హైవేకు ఆనుకుని ఉన్న బంధువులకు చెందిన ఓ కన్వెన్షన్‌లోని మురుగు నీరు వెళ్లేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపట్టాడు. కుంట్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి.. పట్టా భూమిలో ఓ కన్వెన్షన్‌ను నిర్మించాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఆ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి అనుమతులు కావాలంటే 40 ఫీట్ల రోడ్డు అవసరం. ఇందుకోసం ఏకంగా కుంట్లూరు పెద్ద చెరువులోంచి రోడ్డు వేసేందుకు సిద్ధమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ పనులకు మున్సిపల్ కౌన్సిల్ రూ.20 లక్షల నిధుల మంజూరుకు తీర్మానం చేసింది. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు చెరువు సర్వే చేపడుతున్నారు. చెరువులో నుంచే రోడ్డు వేస్తున్నట్లు గుర్తించి, వేసిన రహదారిని తొలగించాలని స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు.

సర్వేచేసి కుంట్లూరు పెద్ద చెరువుకు హద్దులు నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించిన చాలా పనులకు టెండర్లు పిలవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. తొలుత పనులను కానిచ్చేస్తూ ఆ తర్వాత టెండర్లు పిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. మున్సిపల్ అధికారులు ఆయా పనులకు పూర్తి సహకారం అందిస్తున్నట్లు, ఆయా పనులపై ఫిర్యాదులు వెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇండ్లు ఉండి కూడా సమస్యలతో అల్లాడుతున్నామని పలు కాలనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కాకుండా జనావాసాలు లేని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అవసరం లేనిచోట చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కుంట్లూరు పెద్ద చెరువులో వేసిన రోడ్డు
(ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలకు అనుమతిస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది)

అదే జాప్యం..

హెచ్ఎండీఏలో పది రోజుల గడువు పెట్టినా కదలని ఫైళ్లు

hmda Growing Global

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో అనుమతుల జారీలో ఎలాంటి మార్పు లేదు. భవన నిర్మాణ అనుమతుల్లో జరుగుతున్న జాప్యంతో నిర్మాణదారులు ఇబ్బందిపడుతున్నారు. గతేడాది కంటే పనితీరు మెరుగుపడిందని, వేగంగా అనుమతులను జారీ చేస్తున్నామంటూ ఉన్నతాధికారులు ప్రకటనలు జారీ చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. పది రోజుల నిర్ణీత గడువులోగా అప్లికేషన్లను క్లియర్ చేయాలని ఇటీవలే ప్లానింగ్ విభాగానికి ఉన్నతాధికారులు డెడ్‌లైన్ విధించారు. కానీ, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులే ఉన్నాయని పలువురు దరఖాస్తుదారులు చెబుతున్నారు. సాయంత్రం 3 గంటల తర్వాత హెచ్ఎండీఏ కార్యాలయం దరఖాస్తుదారులతో నిండిపోతుండగా, కుప్పలుగా పేరుకుపోతున్న దరఖాస్తులకు ఇదే నిదర్శనంగా నిలుస్తున్నది. ఓవైపు టీఎస్-బీపాస్ ద్వారా దరఖాస్తులను తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయి పరిశీలన, ఎన్‌వోసీ, షార్ట్ ఫాల్స్ కారణంగా 10రోజుల్లో అనుమతులు జారీ చేయాలనే లక్ష్యాన్ని హెచ్ఎండీఏ చేరుకోవడం లేదు. ముఖ్యంగా హైడ్రా తర్వాత నగరంలో దరఖాస్తులను భూతద్దంలో పెట్టి మరీ చూస్తున్నారు. దీంతో అనివార్యంగానే దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతున్నదని ప్లానింగ్ విభాగం పేర్కొంటున్నది. గతంలో నగర పౌరులు సంబంధిత దరఖాస్తుల స్టేటస్‌ను తెలుసుకునే వీలు ఉండగా, ఇప్పుడు సిటిజన్ సెర్చ్ ఆప్షన్‌లో కేవలం పాత, పెండింగ్ ఫైళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. నెలవారీగా దరఖాస్తులను చూసుకునే వీలు లేకపోవడంతో.. దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా పబ్లిక్ డొమైన్‌లో నెలవారీగా అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పొందుపరచాలని పలువురు ఆర్కిటెక్చర్లు అభిప్రాయపడుతున్నారు.

పెండింగ్ పనులపై హెచ్ఎండీఏ ఫోకస్

హెచ్ఎండీఏ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. కొత్వాల్‌గూడ ఏకో పార్క్, కోకాపేట నియోపోలిస్ లేఅవుట్ అభివృద్ధి పనులతోపాటు, నగరంలోని పలు హెచ్ఎండీఏ పార్కుల పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఉన్నతాధికారులను హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై ఇటీవల సమీక్షించిన ఆయన.. పనుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. ఎలివేటెడ్ కారిడార్, మీరాలంకేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.